క్లుప్తంగా

ఓపెన్ జిమ్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. గొల్లవిల్లివానిపాలెం సమీపంలోని సాయిసాధ నగర్‌లో రూ.9.63 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మిస్తున్న ఓపెన్ జిమ్ పనులను మంగళవారం ముమ్మన దేముడు పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే 'కంపెనీ' వ్యర్థజలాలు



రోడ్డుపై నిలిచిపోయిన మురుగునీరు

పరవాడ: లంకెలపాలెం–పరవాడ రహదారిలో సింహాద్రి స్టీల్స్ సమీపంలో మురుగునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సింహాద్రి జంక్షన్ సమీపంలో శ్రీ ప్రసీద స్టీల్ అండ్ మినరల్స్ కంపెనీకి సంబంధించిన మురుగు నీరు కాలువ ద్వారా వచ్చి రోడ్డుపై నిలిచిపోతోంది. ఫలితంగా ఆ ప్రదేశంలో భారీ గుంత ఏర్పడి, ప్రయాణికులను ప్రమాదాలకు గురిచేస్తోంది. రహదారి మీదుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు ఇక్కడ గుంతలో పడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గోతిని పూడ్చడంతో పాటు రోడ్డుపైకి మురుగునీరు విడిచిపెడుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మర్లమాంబకు కుంకుమ పూజలు



పసుపుకొమ్ముల అలంకరణతో అమ్మవారు

పెందుర్తి: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వాలిమెరక జుత్తాడ గ్రామంలో కొలువుదీరిన మర్లమాంబకు మంగళవారం గ్రామ మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి విశేష అభిషేకాలు చేసి, పసుపు కొమ్ములతో అలంకరణ చేశారు. అనంతరం కుంకుమ పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ

రూ.5.4 లక్షల విలువైన వస్తువుల అపహరణ



చోరీకి గురైన హనుమాన్ ఎలక్ట్రికల్స్

సబ్బవరం: అసకపల్లి జంక్షన్‌లోని ఓ ఎలక్ట్రికల్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చొరబడి, విలువైన వస్తువులను చోరీ చేశారు. చోరీ అయిన వస్తువుల విలువ రూ. 5.40 లక్షల వరకు ఉంటుందని షాపు నిర్వాహకుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలివి.. అసకపల్లికి చెందిన కాపుశెట్టి సురేష్ అసకపల్లి జంక్షన్‌లో మూడేళ్లుగా హనుమాన్ ఎలక్ట్రికల్ షాపును నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి యథావిధిగా షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం పక్క షాపు వారు షాపు యజమానికి ఫోన్ చేసి, షాపు తెరచి ఉందని సమాచారం అందించారు. దీంతో సురేష్ వచ్చి చూసేసరికి 105 వైర్ కాయిల్స్, 3 కోర్ స్పేర్ కాయిల్స్–3 బండిల్స్, 2.5 కోర్ వైర్ కాయిల్స్–2 తో పాటు కౌంటర్‌లోని రూ.9 వేలు నగదు మొత్తం రూ.5 లక్షల 40 వేలు దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆ అన్నం అప్పన్న స్వరూపం

అప్పన్న ప్రసాదానికి 35 ఏళ్లు

1989 ఆగస్టు 14న ప్రారంభమైన పథకం • రూ.35.55 కోట్లకు చేరువైన విరాళాలు



అన్నప్రసాద భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



అన్నప్రసాదాన్ని తయారుచేస్తున్న సిబ్బంది

సింహాచలం: నమో నారసింహా అంటూ అప్పన్న దర్శనం కోసం నిత్యం వేలాది మంది భక్తులు సింహాచలం పుణ్యక్షేత్రానికి తరలివస్తుంటారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల ఆకలిని తీరుస్తోంది నిత్య అన్నప్రసాద వితరణ కేంద్రం. నిత్యం వేలాదిమంది భక్తుల ఆకలి తీర్చే..సింహాచలం నిత్యాన్నదాన పథకం బుధవారంతో 35 ఏళ్ల పూర్తి చేసుకుని 36వ ఏటలోకి అడుగుపెడుతోంది. అప్పన్న దర్శనం ఎంత భాగ్యమో..అన్నదాన సత్రంలో భోజనం చేయడం అంతే భాగ్యంగా భావిస్తుంటారు భక్తులు. స్వామివారి దర్శనం పూర్తికాగానే బయటికు వస్తూనే అన్నదాన సత్రంలో భోజనం చేస్తుంటారు. ఆకలే అర్హతగా భక్తులకు ఎల్లవేళలా కడుపునిండా భోజనం వడ్డిస్తూ అందరి మన్ననలు పొందుతోంది అన్నప్రసాద వితరణ కేంద్రం. ఇక్కడ అందించే భోజనాన్ని సింహాద్రి అప్పన్న దివ్య ప్రసాదంగా భావిస్తారు భక్తులు.

ఒడిశా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా సింహాచలం తరలివస్తుంటారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని అందించాలన్న ఉద్దేశంతో దేవస్థానంలో 1989 సంవత్సరం ఆగస్టు 14న నిత్యాన్నదాన పథకానికి శ్రీకారం చుట్టారు. దేవస్థానంలో పనిచేసే ఉద్యోగులే ఈ పథకానికి రూ.50వేలు తొలి విరాళం అందించి ఆద్యులయ్యారు. అప్పటి నుంచి ఈపథకానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వారి ప్రోత్సాహంతో దినదినాభివృద్ధి చెందుతూ నేటికి రూ.35.55 కోట్ల డిపాజిట్లు చేరుకున్నాయి. దాతలు అందించే విరాళాలను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి వాటిపై వచ్చే వడ్డీతో భక్తులకు నిత్యం దేవస్థానం అన్నప్రసాదం అందిస్తోంది.

దాతలకు గుర్తింపు

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష నుంచి ఆపైన విరాళం అందించే దాతలను మహా రాజపోషకులుగా, రూ.50వేలు నుంచి ఆ పైన విరాళం అందించే దాతలను రాజపోషకులగా, రూ.10,116 నుంచి ఆ పైన విరాళాలు అందించే దాతలను పోషకులుగా, రూ.10,116 విరాళాలు అందించేవారిని దాతలుగా దేవస్థానం గుర్తింపునిస్తుంది. ఇప్పటి వరకు రూ.5లక్షలకు పైగా విరాళాలు అందించినవారు 11 మంది, రూ.లక్ష పైగా విరాళాలు ఇచ్చినవారు 468మంది, పదివేలకి పైగా విరాళాలు అందించిన వారు 1,031మంది ఉన్నారు.

బయామెట్రిక్‌తో భక్తుల సంఖ్య లెక్కింపు

అన్నప్రసాదం స్వీకరించేందుకు ప్రతీ రోజూ ఎంత మంది భక్తులు వస్తున్నారో తెలుసుకునేందుకు అన్నదాన భవనంలోకి ప్రవేశించే మార్గంలో బయోమెట్రిక్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల నుంచి వేలి ముద్ర తీసుకుంటారు. తద్వారా రోజుకు ఎంతమంది వచ్చారో లెక్కకడతారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే అన్నప్రసాదాన్ని అందించే ప్రక్రియ మధ్యాహ్నం 3వరకు కూడా కొనసాగుతుంది.



అన్నప్రసాద భవనం వద్ద విరాళాల స్వీకరణ కేంద్రం



అన్నప్రసాద భవనంలో భక్తుల నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న సిబ్బంది

అన్నదానం ఇలా..

సోమవారం నుంచి శుక్రవారం వరకు	:	3500 మందికి
శనివారం	:	7500 మందికి
ఆదివారం	:	5000 మందికి
ప్రతి రోజూ రాత్రి	:	500 మంది వరకు

- రోజుకి ఒక్కో భక్తుడికి వెచ్చించే అన్నప్రసాదం ఖర్చు – రూ.32
- 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు– రూ.2.35కోట్లు
- 2023–24 నాటికి మొత్తం ఎఫ్‌డీలపై వచ్చిన వడ్డీ – రూ.1.96కోట్లు
- 2023–24లో రూ.10,116లోపు వచ్చిన విరాళాలు – రూ.1.63కోట్లు
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో భోజనం చేసిన వారి సంఖ్య – 14,23,159 మంది
- 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 5లక్షలకి పైబడి...

రుచి బాగుంటుంది



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి సింహగిరికి వచ్చినప్పుడల్లా అన్నప్రసాదాన్ని స్వీకరిస్తా. అన్నప్రసాదం ఎంతో రుచికరంగా ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ చేసే సాంబారు రుచే వేరు. మరెక్కడా ఆరుచి రాదని అనిపిస్తుంటుంది. –లక్ష్మి, శ్రీకాకుళం

మహా ప్రసాదంగా భావిస్తా..



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి నిత్యం వస్తుంటా. అన్నదాన భవనంలో భోజనం చేస్తా. మహాప్రసాదంగా అన్నప్రసాదాన్ని భావిస్తాను. దాతల సహకారంతో సింహాచలం దేవస్థానం చేస్తున్న అన్నదానం ఎంతో గొప్ప కార్యక్రమం. –దినేష్, విజయనగరం

దాతల నుంచి విశేష స్పందన



అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. సింహాచలం దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి 35 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ పథకానికి దాతల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. భక్తులకు రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నాం. ప్రస్తుతం అన్నప్రసాదం అందిస్తున్న భవనంలోని పై అంతస్తులోనే స్వామివారి ప్రసాదాల తయారీశాల కూడా ఉంది. ప్రస్తుతం స్వామివారి ప్రసాదాల తయారీకి ప్రత్యేకంగా భవనం నిర్మించి, ఇప్పుడున్న రెండు అంతస్తుల్లోనూ ఒకేసారి సుమారు 600మందికి వరకు అన్నప్రసాదాన్ని అందించే విధంగా ప్రణాళిక చేస్తున్నాం.

–ఎస్.శ్రీనివాసమూర్తి, ఈవో, సింహాచలం దేవస్థానం

ఘనంగా పాదాలమ్మ, బంగారమ్మ పండగ



అమ్మవార్లకు పసుపుకుంకుమలు, చీరలు తీసుకొస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు



పాదాలమ్మ



బంగారమ్మ



ఘటాల గుడి వద్ద పూజలు చేస్తున్న పూజారులు

సింహాచలం: సింహగిరి గ్రామ దేవతలు పాదాలమ్మ, బంగారమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. సింహగిరిపై ఉన్న అమ్మవార్ల ఆలయానికి గిరిజనులు, సింహగిరి పునరావాసులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి పూజలు చేశారు. అమ్మవార్లకు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సింహాచలం దేవస్థానం తరపున ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, పీఆర్వో నాయుడు, సీనియర్ అసిస్టెంట్ వరహాలరావు తదితరులు పాల్గొన్నారు. గ్రామ సంప్రదాయం ప్రకారం రాత్రి అనుపు మహోత్సవాన్ని స్థానికులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పులివేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గిరిజనులు, స్థానికులు పలు వేషధారణల్లో అలరించారు.

శునకాల స్వైరవిహారం



వాడచీపురుపల్లిలో సంతబయలులో తిష్టవేసిన వీధి కుక్కలు

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలో ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయి. మాంసం, చేపల దుకాణాల వద్ద, రహదారులపై సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. రోడ్లపై మాటు వేస్తూ వాహనాలపై రాకపోకలు సాగించే ప్రయాణికులను వెంట తరుముతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా సంతబయలు, బుర్రుమామిడి చెట్టు ప్రాంతంలో నిర్వహించే చేపలు, మాంసం దుకాణాల వద్ద అధిక సంఖ్యలో గ్రామ సింహాలు సంచరిస్తున్నాయి. రోడ్డుపై తిష్టవేస్తూ దుకాణాలకు వచ్చే వారిపై దాడులు చేస్తున్నాయి. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న గ్రామ సింహాలను నియంత్రించడానికి పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓపీఎస్ పునరుద్ధరించాలని ఆందోళన



ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న సభ్యులు

గోపాలపట్నం: పాత పెన్షన్ స్కీమ్(ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరుతూ ఎన్‌ఏడీ మెయిన్‌గేటు వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కొత్త పెన్షన్ స్కీమ్ స్క్రాప్ స్కీమని, పాత పెన్షన్ స్కీమ్ మంచిదని చెబుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలపు మారయ్య మాట్లాడుతూ కొత్త పెన్షన్ స్కీమ్‌తో ఉద్యోగుల హక్కులు, భద్రతను గాల్లో దీపంలా వదిలేసే విధంగా ఉందన్నారు. పాత పెన్షన్ స్కీమ్ వల్ల వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత ఉంటుందని తెలిపారు. అలాగే 8వ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, 18 నెలల డీఏ రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య సౌకర్యం కల్పించాలి

ఉక్కునగరం: ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం వైద్య సౌకర్యం కల్పించే వరకు పోరాటం కొసాగిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై మంగళవారం ఉక్కు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా పదోతేదీ లోగా జీతాలు చెల్లించక పోతే యాజమాన్యాన్ని అరెస్టు చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం మైండ్‌గేమ్ ఆపి ఉత్పత్తి పెంచడంపై దృష్టిసారించాలని హితవు పలికారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు జి. శ్రీనివాసరావు, కె.ఎం. శ్రీనివాసరావు, నమ్మి రమణ, వి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పీహెచ్‌సీ వైద్యాధికారికనకప్పారావు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి కనకప్పారావు

పరవాడ: పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టరు వి.కనకప్పారావు సూచించారు. వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, ఫైలేరియా, టైఫాయిడ్ వ్యాధుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమ కాటు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని వైద్యాధికారి కనకప్పారావు రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హలీమా, ఎంపీహెచ్‌ఎస్ వి.సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాసితులకు అన్యాయం చేస్తే ప్రతిఘటన తప్పదు

అగనంపూడి: విశాఖ ఉక్కు నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తే వేలాది మంది నుంచి తిరుగుబాటు ఎదుర్కోవాల్సి ఉంటుందని విశాఖ ఉక్కు పరిరక్షణ,పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ,పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించిన రిలే దీక్షా శిబిరంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వేలాది ఎకరాల ఉక్కు భూములపై కన్నేసిన ఎన్డీఏ పెద్దలు బడా వ్యాపారులతో కుమ్మక్కై నిర్వాసితులు, ఉద్యోగులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అయోధ్యరామ్, ఎన్.రామారావు, నీలకంఠం, వై.టి.దాస్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో భౌద్ధ మిషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) జి.వి.ఎన్.ప్రసాద్ మిషన్ అభివృద్ధికి కృషి చేసిన అంబటి సర్వేశ్వరరావు, ఎన్. బాలభాస్కరరావు, పరంధామయ్య, సూర్యారావు, మాటూరి శ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావును సన్మానించారు. పలు పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఎస్‌టీఎల్ టెక్నికల్ మేనేజర్ రామ్‌కుమార్ మిషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎల్. లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.